క్లుప్తంగా

జేఈఈ ర్యాంకర్‌కు ఆర్థికసాయం


సన్మానిస్తున్న లక్షణ సేవా సదన్ నాయకులు

వాంకిడి: ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 1782వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటిన దుర్గం అర్జున్‌కు లక్షణ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.5100 ఆర్థిక సాయం అందజేశారు. అర్జున్‌ను శాలువాలతో సన్మానించి అభినందించారు. సొసైటీ చైర్మన్ గాదె అవినాష్ మాట్లాడుతూ ఇటీవల తండ్రి మరణించినా అధైర్య పడకుండా పట్టుదలతో చదివి జాతీయస్థాయిలో మంచి ర్యాంకు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. సొసైటీ ఆర్గనైజర్ గాదె అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ప్రధాన కార్యదర్శి మడావి దౌలత్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోషన్, నాయకులు అరుణ్, ఇంద్రజిత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యూనిఫామ్‌లు పంపిణీ


యూనిఫామ్‌లు అందజేస్తున్న వీవో సభ్యులు

కెరమెరి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నేడు యూనిఫామ్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో సుధాకర్, ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని భీమన్‌గోంది, గోయగాం, నీంగూడ, తదితర పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వీవో సభ్యులు కుట్టిన యూనిఫామ్‌లు అందజేశారు. మరో రెండు రోజుల్లో వంద శాతం యూనిఫామ్‌లను కుట్టి అందజేసేందుకు కృషి చేయాలని వీవో సభ్యులను కోరారు

ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వైద్య రంగంలో సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జిల్లా కేంద్రంలో ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావులకు వారు వినతిపత్రాలు సమర్పించారు. రమేశ్, అజయ్, లక్ష్మణ్, మధుకర్, మదు, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందిస్తున్న ఆర్‌ఎంపీలపై టీఎస్‌ఎంసీ, ఎన్‌ఎంసీలు నిర్వహిస్తున్న దాడులను ఆపాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు ఆర్‌ఎంపీలు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవలు అందిస్తున్నామని, శిక్షణ పొందిన ఆర్‌ఎంపీలపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు ఉచిత శిక్షణ ఇచ్చి సేవలు అందించాలని సూచించిందన్నారు. కానీ నేడు ఆర్‌ఎంపీలపై దాడులను నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్‌ఎంపీలపై దాడులను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో దోపిడీ ఆపాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని ఆపాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ.. అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. తల్లిదండ్రులతో కమిటీలు ఏర్పాటు చేసి ఫీజులు తీసుకోవాలని సూచించారు. ఆ సంఘం నాయకులు విలాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువులు రవాణా చేస్తే చర్యలు

బేల: అక్రమ పశువుల రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో మైనార్టీ, హిందు సంఘాలతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సూచించారు. అక్రమంగా తరలించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

కొనసాగుతున్న పనులు!

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వసతుల కల్పన
- రూ. 1.56 కోట్ల నిధులు మంజూరు
- పూర్తికాని పనులు
- నేటి నుంచి బడులు పునఃప్రారంభం


హరిద్వాయి పాఠశాలలో కొనసాగుతున్న పనులు

వాంకిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూర్చాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'ల పేరుతో ప్రభుత్వ బడులకు నిధులు మంజూరు చేసింది. గత ప్రభుత్వం మన ఊరు –మన బడి పేరుతో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేరు మార్చి ప్రస్తుతం పాఠశాలల్లో పనులు చేపడుతోంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో స్వయం సహాయక మహిళ సంఘాల సభ్యులు ఉండి పనులు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. కాగా మండలంలో 37 ఎంపీపీఎస్ పాఠశాలలు, 22 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో వాటర్, విద్యుత్, టాయిలెట్స్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదు. కొత్త విద్యా సంవత్సరం నేటి నుంచి ప్రారంభం కానుండగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద మండలంలో 59 పాఠశాలలు ఎంపిక కాగా ఆయా పాఠశాలల్లో విద్యుత్ వైరింగ్, నీటి సౌకర్యం కోసం బోర్లు వేయడం, టాయిలెట్ల రిపేర్ పనులు చేయాల్సి ఉంది. ఎంపికైన పాఠశాలలను మార్చి నెలలోనే గుర్తించగా మహిళా సంఘాల కమిటీలు పనులు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. కొన్ని పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి కాగా అనేక బడుల్లో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. నేటి నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండగా బడుల్లో పనులు ఇంకెప్పుడు పూర్తి చేస్తారోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పనుల్లో వేగం పెంచేందుకు కృషి చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నా రు.

59 పాఠశాలలు ఎంపిక..

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మండలంలో ఎంపికైన ఎంపీపీఎస్ బడులో ఇప్పటికే దాదాపు 20 పాఠశాలల్లో మైనర్ వర్కులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన బడులలో కూడా పనులు వేగంగా జరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. టిడబ్ల్యూపీఎస్ పాఠశాలల ఎంపిక ప్రక్రియ కొంత ఆలస్యం అవడంతో అనేక పాఠశాలల్లో పనులు ప్రారంభించాల్సి ఉంది. దాదాపుగా 15 పాఠశాలల్లో పనులు జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన పాఠశాలల్లోనూ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.

ముందుకు రాని కమిటీ సభ్యులు..

అమ్మ ఆదర్శ కమిటీల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యులు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ముందుగా కమిటీ సభ్యులు డబ్బులు వెచ్చించి పనులు పూర్తి చేశాక బిల్లులు పెట్టుకుంటే నిధులు ఖాతాల్లో జమవుతాయి. దీంతో మహిళా సంఘాలు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మండల వ్యాప్తంగా జరుగుతున్న పనుల్లో ప్రైవేటు వ్యక్తులే పనులు చేపడుతున్నట్లు సమాచారం. రికార్డుల పరంగా మహిళా సంఘాల పేర్లు ఉన్నప్పటికీ కమిటీలతో తీర్మానం చేయించుకొని ప్రైవేటు గుత్తేదారులు పనులు చేపడుతున్నారు. పనులు పూర్తి చేసేందుకు గడువు తక్కువగా ఉండటంతో చేసేదేమి లేక ఇలా చేయడం తప్పడం లేదని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం సూచించినట్లు మహిళా సంఘాల సభ్యులు ముందుకొచ్చి పనులు చేపడితే త్వరగా పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

పనుల్లో జాప్యం సరికాదు



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకంలో ఎంపికైన బడుల మరమ్మతుల్లో జాప్యం చేయడం సరికాదు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలి. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి.

– లోబడె లహుకుమార్, విద్యార్థి సంఘం నాయకుడు

పనులు జరుగుతున్నాయి

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకంలో ఎంపికైన పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 20 కంటే ఎక్కువ పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన బడుల్లోనూ త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల ఎంపిక కొన్ని రోజుల క్రితమే జరిగింది. ఆ పాఠశాలల్లోనూ పనులు జరుగుతున్నాయి.

– మనుకుమార్, ఎంఈవో, వాంకిడి

ఘనంగా శివమల్లన్న ఆలయ వార్షికోత్సవం


అలంకరించిన శివమల్లన్న స్వామి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయ 45వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ముద్దు నరహరి శర్మ, ఆలయ అర్చకులు ఇందారపు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, మండపారాధన, రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామివారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక అర్చన మహాహారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యురాలు ఎమ్మాజీ శారద సంతోష్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు సతీమణి రుక్మిణిదేవి, ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా, వేదపండితులు దినేశ్ శర్మ, అనురాగ్ శర్మ, కిశోర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

ఖాళీలతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలి


మాట్లాడుతున్న బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి

రెబ్బెన: బెల్లంపల్లి రీజియన్‌లో జరుగుతున్న ఈపీ ఆపరేటర్ల గ్రేడ్‌టెస్టును ఎన్నికల కోడ్‌తో వాయిదా వేయడం మూలంగా కార్మికులకు అన్యాయం జరగకుండా పాత తేదీ నుంచే పదోన్నతులు కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ మూలంగా ఈపీ ఆపరేటర్ల గ్రేడ్ టెస్టు సీ టూ బీ, బీ టూ ఏ ప్రమోషన్లను ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు వాయిదా వేశారన్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసినందున కార్మికులకు ఏమాత్రం అన్యాయం జరగకుండా పాత తేదీ నుంచే ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు. ఖాళీలతో సంబంధం లేకుండా అర్హులైన ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి.జగ్గయ్య, కిరణ్‌బాబు, శేషశయన రావు, దేవర కొండ దివాకర్, కైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చదివించాలి


కెరమెరి: ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, విద్యార్థులు


వాంకిడి: మాట్లాడుతున్న హెచ్‌ఎం ఇందురావు

కెరమెరి: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చదివించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులను కోరారు. బడిబాటలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పిల్లల గురించి ఆరా తీశారు. అంగన్‌వాడీల్లో ఉన్న చిన్నారుల పేర్లను నమోదు చేసుకున్నారు.

ఖిరిడిలో బడిబాట గ్రామసభ

వాంకిడి: మండలంలోని ఖిరిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బడిబాట గ్రామసభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయు డు సోయం ఇందురావు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని, 3 నుంచి 4 ఏళ్ల పిల్లలను సైతం ప్రీప్రైమరీ తరగతుల్లో చేర్పుకోవడం జరుగుతుందన్నారు. ఉచిత విద్యతో పాటు యూనిఫాం, భోజనం, పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు పే ర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కా ర్యదర్శి జ్యోతి, ఉపాధ్యాయులు పవర్ శృతి, తిప్పారెడ్డి రాజు, మడావి గణపతి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో చేర్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని మోతుగూడ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఎంపీపీ మల్లికార్జున్, ఎంఈవో మనుకుమార్, సీఆర్‌పీ తిరుపతి, నాయకులు వినోద్, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం


ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు


తహసీల్దార్ కార్యాలయం వద్ద..


మార్కెట్ కమిటీ గోదాం వెనుక భాగంలో..

జైనూర్ మండల కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ కరువై మురికి కాలువలు పూడికతో నిండిపోయాయి. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పడేయంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య లోపం కారణంగా రోగాల బారిన పడే ప్రమాదం ఉందని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి చెత్తాచెదారం తొలగించడంతో పాటు మురుగు కాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

– జైనూర్

సొంత భవనాలేవి?

- ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కరువు
- కొత్త మండలంలో సమస్యలు అనేకం
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు


గాదిగూడ పంచాయతీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

నార్నూర్: పాలన సౌలభ్యం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన మండలాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నార్నూర్ ఉమ్మడి మండలం నుంచి గాదిగూడను కొత్త మండలాన్ని ప్రకటించడంతో గిరిజనులు సంబురపడ్డారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో వస్తాయని అనుకుంటే వారి ఆశలు అడియాసలయ్యాయి. కొత్త మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసినా అనేక సమస్యలు వేధిస్తున్నాయి. మండలాన్ని ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో అధికారులు ఇరుకు గదిలో కాలం వెళ్లదీస్తూ ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ ఆఫీసు, బీసీ వసతి గృహం భవనంలో పోలీసుస్టేషన్, ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంపీడీవో, ఎమ్మార్సీ, ఈజీఎస్ మూడు కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడే అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వసతి గృహాల్లో పశువైద్యశాల కేంద్రం, ఐకేపీ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం కొనసాగుతుంది. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి సొంత భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఎంఆర్‌సీ భవనంలో కొనసాగుతున్న ఎంపీడీవో, ఎంఆర్సీ, ఈజీఎస్ కార్యాలయాలు

వసతులు లేవు



గ్రామ పంచాయతీ భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. ఇరుకుగదుల్లో అధికారులు, సిబ్బందికి ఇబ్బందిగా ఉంది. కనీస వసతులు లేవు. మహిళా ఉద్యోగుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సొంత భవనం అయితే బాగుంటుంది.

– విజయానందం, తహసీల్దార్, గాదిగూడ

భవనాలు మంజూరు చేయాలి



కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఇరుకు గదిలో విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. ఏ ఫైల్ ఎక్కడ పెడుతున్నారో అర్థం కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సొంత భవనాలు మంజూరు చేసి పనులు పూర్తి చేయించాలి.

– ఆడ చంద్రకళ రాజు, ఎంపీపీ, గాదిగూడ

అవార్డు గ్రహీతకు సన్మానం


ప్రణయ్‌ను సన్మానిస్తున్న హిందూవాహిని ప్రతినిధులు

ఆసిఫాబాద్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే అవార్డు అందుకున్న జిల్లా కేంద్రానికి చెందిన బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవుడపు ప్రణయ్‌ను మంగళవారం హిందూవాహిని ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ నెల 10న పూణెలోని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ సాంస్కృతిక భవన్‌లో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ వెస్టర్న్ ఇండియా బహుజన రైటర్స్ 4వ కాన్ఫరెన్స్‌లో ప్రణయ్ అవార్డు అందుకున్నారు. హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజు, సాయికృష్ణ, పిప్పిరి తరుణ్, జస్వంత్ పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ'పై సర్వే


చింతలమానెపల్లి: సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో


కెరమెరి: సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్

చింతలమానెపల్లి: మండలంలో మంగళవారం మిషన్ భగీరథ పథకంపై సర్వే నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామ పంచాయితీలలో ప్రభుత్వ జాబితా ఆధారంగా వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కాగా జాబితాలో గ్రామస్తుల వివరాలు పాత గ్రామపంచాయతీల ప్రకారం రావడంతో కొంత అయోమయం నెలకొంది. మిషన్ భగీరథ సర్వర్ పనిచేయక పోవడంతో కార్యదర్శులు సర్వే చేయడంలో ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బాబాసాగర్ గ్రామంలో సర్వేను ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. సర్వే నిర్వహించడంలో పలు సూచనలు అందించారు.

నీళ్లు వస్తున్నాయా..?

కెరమెరి: మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా..? రోజుకు ఎన్ని సార్లు వస్తున్నాయి? ఎంత నీరు వస్తుంది. రుచిగా ఉంటుందా? ఆ నీటిని తాగుతున్నారా? అంటూ ఎంపీడీవో అంజద్ పాషా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ నీటిపై సర్వే ప్రారంభం కాగా ఎంపీడీవో రింగన్‌ఘాట్, కొఠారి, పార్ద, ధనోరా గ్రామాల్లో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. రోజుకు 30 నుంచి 35 ఇళ్లను సర్వే చేయాలని సూచించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


సన్మానం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కౌటాల: మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సిద్దల దేవయ్యను మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కౌటాలకు చెందిన సిద్దల దేవయ్య మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం నాయకులు పిట్టల సత్యనారాయణ, గోగర్ల వెంకటేశం, నాందేవ్, బానయ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.